రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మందమర్రి, ఫిబ్రవరి 21: గుర్తు తెలియని వాహనం ఢీకొని బండి అనిల్(25) మృతి చెందిన సంఘటన మందమర్రి పట్టణంలో జరిగింది. పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని అంగడిబజార్ కాలనీకి చెందిన అనిల్ ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా ఎర్రగుంటపల్లి క్రాస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనిల్ అన్న బండి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కౌన్సిలర్ రాజీనామా ఆమోదం

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 21: మంచిర్యాల మున్సిపాలిటీలోని 16వ వార్డు కౌన్సిలర్ బోరిగం శ్రీనివాస్ రాజీనామాను కలెక్టర్ బదావత్ సంతోష్ ఆమోదించారు. ఈ నెల 12 న బోరిగం శ్రీనివాస్ తన వ్యక్తిగత కారణాలతో కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసూ మున్సిపల్ కమిషనర్‌కు లేఖ అందించారు. ఈ నెల 16న కౌన్సిలర్ శ్రీనివాస్ వ్యక్తిగతంగా కలెక్టర్‌ను కలిసి తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. కలెక్టర్ ఆమోదించారు. మున్సిపాలిటీలోని 16వ వార్డుకు కౌన్సిలర్ స్థానం ఖాళీగా ఉన్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

స్తంభాలను తొలగించాలి

జన్నారం, ఫిబ్రవరి 21 : మండలంలోని ఇందన్‌పెల్లికి చెందిని లశెట్టి గంగవ్వ సొంత భూమి సర్వే నంబర్ 82లో 1.30 ఎకరాల పొలం మధ్యలో నుంచి రెండు విద్యుత్ స్తంభాలను అనుమతి లేకుండా విద్యు త్ అధికారులు వేశారని వాటిని వెం టనే తొలగించాలని పట్టేదార్ మహిళా రైతు కోరారు. గతంలో విన్నవించినా అధికారులు పట్టించుకోలేదని ఇప్పటికైనా తొలగించాలని కోరారు.

ఈ-కేవైసీ నమోదు

జన్నారం, ఫిబ్రవరి 21 : మండలంలోని కవ్వాల్ క్లస్టర్‌లో పీఎం కిసాన్ సమ్మాన్‌కు ఈ కేవైసీకి ఆధార్‌కార్డు లింక్ చేసుకోని రైతులకు దేవునిగూడలోని రైతు వేదికలో ఈ-కేవైసీ ఆధార్ లింక్ నమోదు ప్రక్రియను విస్తరణ అధికారి సయ్యద్ అక్రమ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ బీపీఎం లక్ష్మి తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-313897-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

కొలువుదీరిన సారలమ్మ

- గద్దెపై ప్రతిష్ఠించిన కోయ పూజారులు
- మొక్కులు చెల్లించిన భక్తులు

మందమర్రి : సారలమ్మను ఊరేగింపుగా గద్దెకు తీసుకువస్తున్న భక్తులు

మందమర్రి, ఫిబ్రవరి 21: డప్పు చప్పుళ్లు శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల నడుమ అంగరంగ వైభవంగా సారలమ్మ తల్లిని గద్దెకు తీసుకువచ్చారు. సింగరేణి మందమర్రి ఏరియాలోని ఆర్కే1ఏ గని పాలవాగు సమీపంలో గద్దె వద్దకు బుధవారం మందమర్రి పట్టణంలోని అంగడిబజార్ కేకే 1 సీఎస్‌పీ రోడ్డులోని భక్తుడు దూలం కనకయ్య ఇంటి నుంచి సారలమ్మ తల్లిని తీసుకువచ్చారు. సారలమ్మ తల్లి శోభాయాత్ర యాపల్, పాత బస్టాండ్, రామన్ కాలనీ, శాంతినగర్, గాంధీనగర్, మార్కెట్, పాలచెట్టు ఏరియాల మీదుగా ఆర్కే1ఏ గద్దెల వరకు సాగింది. దారి పొడుగునా భక్తులు దండాలు పెడుతూ స్వాగతం పలికారు.

పెద్దబుగ్గలో ..

బెల్లంపల్లి రూరల్, ఫిబ్రవరి 21 : మండలంలోని పెద్దబుగ్గ అటవీ ప్రాంతంలో బుధవారం సమ్మక్క-సారలమ్మ జాతర అట్టహాసంగా ప్రారంభమైంది. కరిసెలఘుట్టం గ్రామం నుంచి కోయపూజారులు సారలమ్మ బోనంతో డప్పు చప్పుళ్లు,మంగళ వాయిద్యాలతో గద్దెకు తీసుకువచ్చారు. కరిసెలఘుట్టం, బుగ్గగూడెం, తాండూర్,బోయపల్లి, కాసిపేట, కోమటిచేను గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. జాతర కమిటీ సభ్యులు సాలిగాం బానయ్య ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ పోటీలను నిర్వహించారు. బుగ్గ ఆలయ కమిటీ చైర్‌పర్సన్ దంపతులు మాసాడిశ్రీదేవీశ్రీరాములు గద్దెల వద్ద మొక్కు చెల్లించుకున్నారు.

కోటపల్లిలో..

కోటపల్లి, ఫిబ్రవరి 20 : కోటపల్లి మండలంలో నక్కలపల్లి, మల్లంపేట, రాపనపల్లి గ్రామాల్లో సమ్మక్క-సారలమ్మల జాతర బుధవారం ప్రారంభమైంది. అమ్మవార్లను గద్దెల పైకి తీసుకువచ్చి ప్రతిష్ఠించగా, భక్తులు మొక్కలు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రెండు రోజుల పాటు జాతర కొనసాగనుండగా పెద్ద సంఖ్యలో భక్తులు ఈ జాతరకు హాజరుకానున్నారు.

పాలవాగు ఒడ్డున జాతర ప్రారంభం..

రామకృష్ణాపూర్ : సారలమ్మను ఊరేగింపుగా తీసుకువస్తున్న పూజారులు, నాయకులు, సింగరేణి అధికారులు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 21: సింగరేణి మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ ఆర్కే1ఏ గని సమీపంలోని పాలవాగు ఒడ్డున వనదేవత సారలమ్మ గద్దెపై బుధవారం సాయంత్రం కొలువుదీరింది. సమీపంలోని అడవి నుంచి డప్పు చప్పుళ్లు, శివసత్తుల నృత్యాలు, గుస్సాడీ నృత్యాలు, మహిళల నృత్యాలతో గిరిజన పూజారులు దూలం కనకయ్య, జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ఓదెలు, ఏఐటీయూసీ సంఘం అధ్యక్షుడు వీ. సీతారామయ్య, సింగరేణి ఏరియా జీఎం ఏ.మనోహర్ ఎదుర్కొని సారలమ్మను గద్దెలపైకి తీసుకొని గద్దెపై నిలిపి పూజలు చేశారు. అనంతరం జీఎం మనోహర్, సీతారామయ్య, నల్లాల ఓదెలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వారు మాట్లాడుతూ సమ్మక్క-సారలమ్మ కొలువై ఉన్న ప్రాంతాన్ని రాబోయే రోజుల్లో అద్భుతంగా తీర్చిదిద్దుతామని హామీనిచ్చారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ ప్రెసిడెంట్ వీ సీతారామయ్య, ఆర్కే1ఏ గని మేనేజర్ జయంత్‌కుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సంక్షేమ అధికారులు కార్తిక్, ఆసిఫ్, క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్ పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ పిట్ కార్యదర్శులు సురమల్ల వినయ్ పాల్గొన్నారు.

కోటపల్లి: మల్లంపేట గ్రామంలో గద్దెల వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

రామకృష్ణాపూర్ : పూజలు చేస్తున్న సింగరేణి అధికారులు

తల్లీ వస్తున్నం..

- ఆర్టీసీ బస్సుల్లో మేడారానికి తరలిన భక్తజనం

ఆర్టీసీ బస్సులో బయలుదేరుతున్న భక్తులు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 21: సమ్మక్క-సారలమ్మ మహాజాతర కోసం భక్తులు మేడారానికి తరలివెళ్తున్నారు. జిల్లాలో మంచిర్యాల, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, చెన్నూరు ప్రాంతాలనుంచి ఐదు కేంద్రాల ద్వారా బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు 106 ఆర్టీసీ బస్సుల్లో 4721 మంది ప్రయాణీకులను మేడారానికి తరలించారు. ఇందులో 2446 మంది ప్రయాణికులు మహాలక్ష్మి పథకం కింద ఉచితంగా ప్రయాణించగా, 2275 మంది ప్రయాణికులు చార్జీలు చెల్లించి వెళ్లారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంచిర్యాల ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

మేడారం వెళ్తుండగా ప్రమాదం

- ఐదుగురికి గాయాలు

మందమర్రి రూరల్, ఫిబ్రవరి 21: మేడారం జాతరకు వెళ్తుండగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మంచిర్యాల జిల్లా వాసులకు గాయాలయ్యాయి. భూపాలపల్లిలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స అనంతరం వారంతా స్వగ్రామానికి చేరుకున్నారు. మందమర్రి మండలంలోని పొన్నారం గ్రామానికి చెందిన ముప్పిడి చిన్నక్క, పెంచాల శ్రీనివాస్, ముడివెల్లి వెంకటేశ్, నీలం సుష్మిత ఆర్టీసీ బస్సులో మేడారం బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న బస్సును బొగ్గు టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టింది. గాయాలైన వారిని భూపాలపల్లి దవాఖానకు తరలించారు. చికిత్స అనంతరం వారు స్వగ్రామాలకు చేరుకున్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 21: మున్సిపాలిటీలోని ఇటిక్యాల గోదావరి తీరన జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను బుధవారం మంచిర్యాల ఏసీపీ రత్నపురి ప్రకాశ్ పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని జాతర కమిటీ సభ్యులకు సూచించారు. గోదావరి నది ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ఎక్కువగా ఉన్నందున అటుగా నీటిలోకి ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఏసీపీ వెంట ఎస్ఐ చంద్రకుమార్, జాతర కమిటీ సభ్యులు ఉన్నారు.

మంగెనపల్లిలో జాతరకు ఏర్పాట్లు పూర్తి

వేమనపల్లి, ఫిబ్రవరి 21 : మండలంలోని మంగెనపల్లి శివారులో గురువారం నుంచి జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. గద్దెల వద్ద టెంట్లు, తాగునీరు, తదితర సౌకర్యాలు కల్పించారు.

కమిటీసభ్యులతో మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాశ్

జోరుగా ఎత్తు బంగారం మొక్కులు..

మొక్కు చెల్లిస్తున్న యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు సదానందం యాదవ్

మందమర్రి, ఫిబ్రవరి 21: మందమర్రి పట్టణంలో సమ్మక్క-సారలమ్మ జాతర సందడి జోరందుకున్నది. బుధవారం భక్తులు ఇండ్లలో పూజలు నిర్వహించి, ఎత్తు బంగారం(బెల్లం) తూకం వేయించారు. పట్టణంలోని మార్కెట్, పాత బస్టాండ్, యాపల్ ఏరియాల్లో దుకాణాల వద్ద సందడి నెలకొన్నది. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి పాత బస్టాండ్ ఏరియాలో దుకాణం వద్ద ఎత్తు బంగారం తూకం వేయించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

షాదీఖానా స్థలం కబ్జా కాకుండా చూడాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 21 : పట్టణంలోని షంషీర్‌నగర్ షాదీఖానా స్థలం కబ్జా కాకుండా చూడాలని ముస్లిం మైనార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి ముస్లింలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర మైనార్టీ సెల్ మాజీ కో ఆర్డినేటర్ అన్వర్‌ఖాన్, నాయకులు జావీద్ ఖాన్, అష్జల్ బాబా, ఎండీ ఖాదీర్, ఎండీ పాషా, ఎండీ సలీం, అమానుల్లాఖాన్, ఆసిఫ్, షేక్ జహీర్, రంజాన్ అలీ తదితరులున్నారు.

'పెద్దపల్లి పార్లమెంట్‌లో ఎగిరేది బీజేపీ జెండానే'

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 21: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి కొప్పు భాష అన్నారు. బుధవారం మంచిర్యాలలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌తో కలిసి మాట్లాడారు. ఈ నెల 23న పెద్దపల్లి పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజయసంకల్ప యాత్రను చేపడతున్నారని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వద్దు : ఎంపీడీవో

మందమర్రి రూరల్, ఫిబ్రవరి 17: పల్లెల అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వద్దని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. బుధవారం వెంకటాపూర్, పొన్నారం గ్రామాల్లో ఈజీఎస్ పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీరయ్య, ఈసీ రఘు, పంచాయతీ సెక్రటరీలు హరీశ్, ప్రశాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ జిల్లా అధ్యక్షుడు ఈద లింగయ్య ఉన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

భీమారం, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలో మరుదొడ్ల నిర్మాణానికి స్థలం కేటాయించాలని మంగళవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కుమార్‌కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్ వినతి పత్రం అందించారు. ఈ మేరకు రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఊర చెరువు కట్ట వద్ద సర్వే నంబర్ 563లో 2 గుంటల భూమిని అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సతీశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సర్వేయర్ నాగరాజు, మాజీ సర్పంచ్ గద్దెరాంరెడ్డి, తదితరులున్నారు.

మండల అభివృద్ధిపై ఎమ్మెల్యేతో చర్చలు

కాసిపేట, ఫిబ్రవరి 21 : బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో మంచిర్యాలలో కాసిపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో సమావేశమై మండల అభివృద్ధిపై చర్చించారు. అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాలు తదితర కార్యక్రమాలపై చర్చించారు. మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, సీనియర్ నాయకులు బన్న లక్ష్మణ్‌దాస్, జనరల్ సెక్రటరీ మైదం రమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

జాతరలో ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై తీర్మానం

తాండూర్, ఫిబ్రవరి 21 : మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరపై మండలంలోని రేచిని జడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం ప్రదీప్ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం నమూనా జిల్లా పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ జాతరలో ప్లాస్టిక్‌పై నిషేధం, తదితర అంశాలపై పాటించాల్సిన నిబంధనలపై తీర్మానించారు. ఈ కార్యక్రమంలో బయోసైన్స్ టీచర్ ఎం సరోజ, ఉపాధ్యాయులు జయశ్రీ, బట్టూరి వెంకటేశ్వర్లు, రత్నయ్య, సతీశ్, శ్రీనివాస్, రమేశ్, సుకుమాంజలి, రవి బాబు, రాజేశం, తదితరులున్నారు.

భీమారంలో..

భీమారం, ఫిబ్రవరి 21 : సమ్మక్క-సారలమ్మ, జాతరలో పర్యావరణాన్ని కాపాడేందుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నమూనా జిల్లా పరిషత్ సమావేశం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, విలేకరుల ప్రాతలను విద్యార్థులు పోషించారు. ఈ జాతరలో పాటించాల్సిన అంశాలపై తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డీ. విక్రమ్ కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు ఏ. వెంకటేశ్వరావు, సోషల్ ఉపాధ్యాయులు రవీందర్, సీనియర్ ఉపాధ్యాయులు జీ. తిరుపతి తదితరులున్నారు.

పారిశుధ్య పనులు పూర్తి చేయాలి

జన్నారం, ఫిబ్రవరి 21 : జన్నారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సంపూర్ణ పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో శశికళ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రమేశ్, ఈసీ విలాస్, ఎంపీవో రమేశ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

తాండూర్‌లో డీపీవో పర్యటన

తాండూర్, ఫిబ్రవరి 21 : జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు తాండూర్‌లో బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. తాండూర్ గ్రామపంచాయతీలో ఆయన రికార్డులు పరిశీలించిన అనంతరం తాండూర్ నర్సరీ, డంప్ యార్డ్, జడ్పీ హైస్కూల్‌ను, వీధుల్లో పారిశుధ్య పనులు, సైడ్ డ్రైనేజీల నిర్వహణ పనులను పరిశీలించారు. నర్సరీలో మొక్కలు షిఫ్టింగ్ గ్రేడింగ్ చేయాలని సూచించారు. డంప్ యార్డులో సెగ్రిగేషన్ విషయంలో శ్రద్ధ వహించాలని, పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కిరాణాషాప్‌ల ముందు ప్లాస్టిక్ వస్తువులు కనబడితే జరిమానా విధిస్తామని యజమానులకు తెలిపారు. డీపీవో వెంట ఎంపీడీవో పీ శ్రీనివాస్, డీపీఎం నరేందర్, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తపాస్‌కుమార్, జీపీ సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీపీవో

వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలి : డీఎల్పీవో

జన్నారం, ఫిబ్రవరి 21 : ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని డీఎల్పీవో ధర్మారాణి సూచించారు. బుధవారం మండలంలోని మురిమడుగు గ్రామ పంచాయతీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. పలు కాలనీల్లో పర్యటించి పారిశుధ్య పనులపై పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపీవో రమేశ్, కార్యదర్శులు జంగు, చంద్రమౌళి పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్పీవో ధర్మారాణి

గాంధారి ఖిల్లా మైసమ్మ జాతర పోస్టర్ విడుదల

పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

కాసిపేట, ఫిబ్రవరి 20 : కాసిపేట మండలంలోని లంబాడీతండా(డీ) నాయకపుగూడలో బొక్కలగుట్ట గాంధారి ఖిల్లా మైసమ్మ జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే జాతరకు ఆదివాసీ గిరిజనులు, అన్ని వర్గాల వారు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంగ శ్రీకాంత్, మంగ భీమయ్య, మరపు వెంకటేశ్, మంచాల ప్రవీణ్, సురేశ్, సేదం శివ, మంగకు మార్, మంచాల మహేశ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 21 : ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వార్షికోత్సవం, ఫేర్‌వెల్ పార్టీ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఐఈవో శైలజ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆమె సత్కరించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్‌రావు, ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ ఉదారి చంద్రమోహన్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఆవుల అంజయ్య, పీడీ బొంకూరి బాబురావు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎడ్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కళాశాలలో..

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మంచిర్యాల అర్బన్ , ఫిబ్రవరి 21 : మంచిర్యాలలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ పార్టీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2023 సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ మహేందర్‌రెడ్డి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీఎస్ పాఠశాలలో..

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 21: పట్టణంలోని ఎస్సీఆర్ గార్డెన్స్‌లో స్థానిక కృష్ణవేణి ఉన్నత పాఠశాల 13వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, డైరెక్టర్లు ఎంబడి రమేశ్, పెట్టెం తిరుపతి, పేరెంట కమిటీ అధ్యక్షుడు రమేశ్ చంద్‌జైన్, వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల కిరణ్, కౌన్సిలర్ చింత సువర్ణ అశోక్, బానాల రమేశ్, బియ్యాల తిరుపతి, సతీశ్, రాందేని చిన్న వెంకటేశ్, పాయల వేణు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

వొకేషనల్ కళాశాలలో..

నృత్యం చేస్తున్న వొకేషనల్ కళాశాల విద్యార్థినులు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 21: మంచిర్యాలలోని మంచిర్యాల వొకేషనల్ జూనియర్ కాలేజీ, శ్రీ సాయి పారా మెడికల్ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంచిర్యాల వొకేషనల్ కాలేజీ చైర్మన్, కరస్పాండెంట్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాలలో చదివిన వారిలో ఎంతో మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు సౌమ్య, ప్రవీణ్, ఖాజా హుస్సేన్, డాక్టర్ పీ మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట ప్రభుత్వ కళాశాలలో..

నృత్యం చేస్తున్న కాసిపేట జూనియర్ కళాశాల విద్యార్థులు

కాసిపేట, ఫిబ్రవరి 21 : కాసిపేట మండల కేంద్రంలోని కాసిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు విద్యార్థులకు పరీక్షలపై పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, పల్లె మల్లయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సురక్షిత మేడారం జాతర పోస్టర్ విడుదల

పోస్టర్లను విడుదల చేస్తున్న డీఈవో, ప్రధానోపాధ్యాయులు

నస్పూర్, ఫిబ్రవరి 21 : మేడారంతో పాటు మంచిర్యాల జిల్లాలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరను సురక్షితంగా జరుపుకోవాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం, రాష్ట్ర కాలుష్య నివారణ పర్యావరణ విభాగం రూపొందించిన సురక్షిత మేడారం జాతర పోస్టర్లను బుధవారం డీఈవో యాదయ్య విడుదల చేశారు. జాతరలో సింగ